


“చేసేదేముందీ? ఎవరి కెంత
ప్రాప్తమో అంత!”

బట్టలు బేరం చేస్తున్న హేమ ఒక్కసారి తుళ్ళిపడింది. ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం అవే మాటల్ని విన్నట్టు చప్పున జ్ఞాపకమొచ్చి నవ్వుకున్నది.

నాటికి నేడు మళ్ళీ అవేమాటలు! అదేగొంతు!

అతనే! సందేహంలేదు. ఈ పదిహేనేళ్ళ కాలంలో అతనిలో పెద్ద మార్పేదీ ఉన్నట్టు కనబడలేదు.

అప్పుడు పంచెలు కట్టుకునేవాడు.

ఇప్పుడు టెర్లిన్ పాంటూ, టెర్లిన్ స్లాకూ తొడుక్కున్నాడు.

అప్పటికంటె కొద్దిగా మాత్రమే లావు. నింకడగా అతను ఎవరితోనో మాట్లాడుతున్నాడు—తను మాట్లాడుతున్న వ్యక్తిని తప్ప పరిసరాలు మరిచిపోయి, ఎప్పటిలాగే!

"హలో! రామూ! గుర్తున్నానా?"

ముందుకెళ్ళి పలకరించింది హేమ, తనను చూడగానే అత్యంత సంభ్రమంతో పలకరిస్తాడని గట్టి నమ్మకంతో.

"క్షమించండి...మీరు..."

అతను తొట్రుపడుతూ ఆగిపోయాడు. క్షణం మలినమయింది హేమ ముఖం. అంతలో లేనినవ్వు తెచ్చుకొని "భలేవాడివే! నన్ను మరిచిపోయావా? పైగా ఈ మీ రొకటా! నేనయ్యా! హేమని..." అంది.

"హేమ....హేమ...మీరా?"

ఆలోచిస్తున్నట్లు నిలబడిపోయాడు—శూన్యంలోకి చూస్తూ.

ఈసారి హేమ ముఖం వడిలిపోయింది.

"అదృష్టవంతుడివి. ఎంత తేలికగా మరిచిపోయావ్!" అన్నది.

"క్షమించాలి. నిజంగానే మరిచిపోయాను. ఇప్పుడు గుర్తొచ్చింది."

"ముందా 'అండీ' మానెయ్యి—నిన్ను మీరంటూ పిలవలేనిప్పుడు—నేను నీలాంటి అదృష్టవంతురాలిని కాను గనుక—నిన్ను మరిచిపోలేదు గనుక—నువ్వు మీరని పిలిచినా సహించలేను."

ఎదుటి వ్యక్తుల్ని నొప్పించలేని సహృదయత ఉట్టిపడే ఆర్ద్రతతో—గుర్తించుకోలేని తనను క్షమించమని ప్రాధేయపడుతున్న భావం అతని ముఖంలో కనపడ్డది.

"పదిహేనేళ్ళ క్రితం నీ కోసం, నీ స్నేహంకోసం పనికట్టుకుని హైదరాబాద్ నుండి బెజవాడ వచ్చిన అమ్మాయిని. కలిసిన స్నేహం నిలుపుకోలేక తెంపుకున్న విర్భాగ్యురాలిని కూడా."


"చాలా మారిపోయావు. బాగా లావయిపోయావు. మొత్తం ఇంకో అమ్మాయిలా అయిపోయావు. అందుకని చప్పున గుర్తుపట్టలేకపోయాను... లేకపోతే నిన్ను...అప్పటి నిన్ను.... గుర్తుపట్టలేనా?"

సంజాయిషీ ఇచ్చుకొంటున్నట్లు అన్నాడు. ఆ సంజాయిషీ హేమ హృదయాన్ని ఊరడించలేదు.

ముప్పైమూడేళ్ళు నిండిన వయసును ఎత్తిచూపింది. వ్యర్థంగా గడిచిపోయిన వయసు మళ్ళబోతోందని హెచ్చరించింది.

వయసుతోపాటు వదలని కన్నె మనసును మాత్రం కుదిపి కూల్చింది.

"హమ్మయ్య! ఇప్పటికి గుర్తొచ్చాను గదా!" అంది కన్నీళ్ళతో... చిరునవ్వుతో....




"ఏం చేస్తున్నావమ్మా."
"చంద్రుణ్ణి చూస్తున్నా!"
"రోజూచూసే చంద్రుడేకాదుటే వచ్చి పడుకోక!"

---

ఆమె కను కొలకులలో నీటి బిందువులు చూసి కలవరపడుతూ. "వచ్చావు. గుర్తొచ్చావు. ఇంకె ప్పుడూ మరిచిపోను..." అనేశాడు గబగబా...

గలగల నవ్వింది.

అదే కంగారు! అదే పసితనపు స్వచ్ఛందం!

"ఇంక మరిచిపోనివ్వను. ఇక్కడే ఉంటానుగా! నువ్వెప్పుడొచ్చావ్ ఇక్కడికి?"

"ఇప్పుడా? పదేళ్ళయింది. సినిమాలలో పాటలు వ్రాస్తున్నప్పటి నుండీ ఇక్కడే ఉంటున్నాను."

"సినిమాలలో పాటలు వ్రాస్తున్నావా?"

"ఆ! సుమశ్రీ అనే పేరుతో..."

"సుమశ్రీ నువ్వా?"

"ఆ! నేనే! నీకు తెలీదా?"

"ఉహూ! నాకేం తెలీదు. చిత్రం! పదేళ్ళబట్టీ ఒకే నగరంలో ఉంటూ ఒకరి నొకరం కలుసుకోలేదు! నీకు తెలుసుగా, నే నిక్కడుంటున్నట్లు? నాకు కనపడలేదేం, ఇన్నాళ్ళలో?"

అతను రెండు క్షణాలు బాధగా దిక్కులు చూశాడు.

"ఇకముందు మనం కలుసుకోగా దన్నావు జ్ఞాపకం ఉందా?'' అన్నాడు నవ్వుతూ.

హేమ సమాధానం చెప్పలేక పోయింది. క్రింది పెదవిమాత్రం పళ్ళ మధ్య నలిగింది.

హేమ బాధపడుతున్నట్లు గ్రహించి అనునయంగా. "ఇంటికెళ్దాంరా! ఇప్పు డయితేనేం! కలుసుకున్నాంగా!'' అని కారు దగ్గిరకునడిచా డతను

"నీకు కారు కూడా ఉందే!" ఆశ్చ ర్యంగా అంది.

"ఆ! ఇటీవలే కొన్నాను. బాగుందా?"

"బ్రహ్మాండంగా ఉంది.''

రాము ఆర్థిక స్థితిగతుల్లో చాలా మార్పు వచ్చినట్టు తెలుస్తూనే ఉంది.

ఆనాడు తను మొదటిసారి చూసి నప్పుడు తాలూకా ఆఫీస్‌లో గుమస్తా అయిన రాము, రిక్షాలో వెళ్తే డబ్బాయి పోతుందని మైలుదూరం నడిచి వెళ్ళే వాడు ఇంటికి.

రాముతో పరిచయం తనకు చాలా చిత్రంగానే జరిగింది. పత్రికలలో అతని గేయాలు చదివినప్పుడు నిజంగానే తనకు మతిపోయేది. అతని పేరు చెప్పగానే పరవశించిపోయే అసంఖ్యాక పాఠకుల్లో తనూ ఒకతె ఆ రోజుల్లో - నిగ్రహించు కోలేక అతని గేయాన్ని ప్రశంసిస్తూ ఒక లేఖ వ్రాసింది. మొదట్లో పాఠకు రాలిగా-ఆదరంగా సమాధానం వచ్చింది. అలా మొదలయిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆత్మీయతాస్థాయికి చేరుకోవటానికి ఎంతో కాలం పట్టలేదు -

యమ్. బి. బి. యస్. మొదటి సంవత్సరం అయిపోయింది.

"నిన్ను చూడటాని కొస్తున్నా"నని వ్రాసింది.

"వెయ్యికళ్ళతో ఎదురుచూస్తుంటా" అని సమాధానం వచ్చింది. తనతో చదువు కున్న ఒక అమ్మాయికి, సరిగ్గా అదే సమయంలో, బెజవాడలో పెళ్ళి కాబో వడం బాగా కలిసొచ్చింది శుభలేఖ ఇంట్లో చూపించి రైలెక్కేసింది హేమ.

"హేమా! హేమా!" అని గట్టిగా అరుచుకుంటూ ప్లాట్‌ఫాం అంతా తిరిగే స్తున్నాడు హడావుడిగా ...

తనే హేమనని తెలియజెప్పటానికి రుమాలు ఊపుతూ చిరునవ్వు నవ్వింది.

"హలో! మీకోసం - నీకోసం___"


ఎంత తడబడతాడు!

కిలకిల నవ్విందితను —

"నన్ను 'నువ్వు' అని పిలవ్వచ్చు అదే సంతోషంనాకు" - అన్నది తను.

"నువ్వు కూడా నన్ను నువ్వనేపిలు! లేకపోతే నేను మీరనేస్తాను -" అన్నా డతను.

తను నవ్వింది - అంగీకార సూచ కంగా -




సామానుతో బయటికొచ్చి టాక్సీని పిలవబోయింది తను.

"టాక్సీ ఎందుకు రిక్షాలోపోదాం –" వెలవెలపోతూ అన్నాడు.

"ఒక్కరిక్షా ఎలా—"

"రెండు రిక్షాలు పిలుస్తాను –"

అప్పటి కింకేం మాట్లాడలేక పోయింది.

అతను ఉంటున్న ఇల్లు అనబడే ఆవరణ చూసేసరికి శరీరం జలదరించింది తనకి.

మురికిసందులో రెండే రెండు గదుల వాటా. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సూర్యుడు తొంగిచూస్తున్నాడు. ఆ చిన్నగదిలో అతనితోపాటు అతని తల్లి – తండ్రి – ఇద్దరు చెల్లెళ్ళు. అప్రయత్నంగా తనకు తమ డాబాఇల్లు–ఇంటిముందరి చక్కని పూలతోట స్మృతిపథంలో మెదిలాయి.

ఒక్క గంటకంటె ఆ ఇంట్లో ఉండలేక పోయింది.

"నన్ను క్షమించండి. మా స్నేహితురాలి పెళ్ళికొచ్చాను. అక్కడికి పోవాలి. మళ్ళీకలుస్తాగా !"

అతని ముఖం కొద్దిగా మలినమయినా అడ్డు చెప్పలేకపోయాడు.

"మా యింట్లో ఉండక తప్పదు," అనగలిగేచొరవ అతనిదగ్గరలేదు.

వచ్చేటప్పుడు తన మనసులోకదిలిన

బంగారు కలలన్నీ ఈ వాస్తవికత ముందు కరిగిపోయాయి.

రాము తనను ఆకర్షించక పోలేదు కాని అతను ఒక యల్. డి. సి : తను యమ్. బి బి యస్. విద్యార్థిని.

అఇంట్లో—అమనుష్యులతో—భయంతో గెడ్డకట్టుకుపోయింది తను.

అయినా రాము వచ్చి కనకదుర్గ దేవాలయానికి తీసికెళ్తానన్నప్పుడు సంతోషంగానే వెళ్ళింది.

అతనితో పాటు మెట్లెక్కి కొండమీద నించుని బొమ్మరిళ్ళలా కనిపించే బెజవాడ ఇళ్ళని చూస్తూ నించునేది.

అధునిక కవిత్వంలో తీరు తెన్నుల గురించీ, అభ్యుదయకవుల కవిత్వం గురించీ ఏవేవో మాట్లాడేవాడు అతడు...

అతడేం మాట్లాడినా తనకు అద్భుతంగానే ఉండేది. అతను చెప్పిన విషయాలకన్నా అతని కంఠస్వరం ఎక్కువగా ఆకర్షించేది తనని....

ఏదో అలౌకిక సంగీతం పాడుతున్నట్లు ఆమాటలు వింటూ నిలిచి పోయేది.

ఉన్నట్లుండి "హేమా ?" అనేవాడు రాము.

ఎందుకన్నట్లు చూసేది.

అతని ముఖం ఎఱ్ఱబడి పోయేది. ఆ వేసవి సాయంత్రాలలో కృష్ణానది మీంచి చల్లని గాలులు వీస్తున్నా శరీరమంతా చెమటలుపట్టేవి — చేతి రుమాలుతో ముఖం మళ్ళీ మళ్ళీ వత్తుతాడు. ఒక్క క్షణం తన ముఖంలోకీ — మరికొన్ని క్షణాలు పరిసరాలూ చూసి చివరకు మరేదో సంభాషణలోకి దిగిపోయేవాడు.

అతను చెప్పదలుచుకున్నది అతని కంఠంలోనే నిలిచిపోయేది.

అయినా అతడు చెప్పకుండానే అతని మనసు తనకు తెలిసిపోయేది.

ఎఱ్ఱబడ్డ అతనిముఖంలో — ఆరాధన ఉట్టిపడే కళ్ళలో — కంపించే కాయంలో ప్రకంపించే గాత్రంలో — అతని మనసంతా స్పష్టంగా కనిపిస్తోంటే ఎందుకు తెలియదు ?

తన దగ్గరనుండి ఏ కొద్దిపాటి ప్రోత్సాహమయినా అతని మనసులోని మాటలకు భాషనిప్పించి ఉండేది అతని చేత.


అయినా తను ఏమీ ఎరగని అమాయకురాలిలానే నటించేది. అతనిని అయోమయంలో ఉంచేస్తూ.

తనే నిర్ణయానికి రాలేని విషయంలో అతనికి ప్రోత్సాహ మెలా ఇయ్యగలదు?

ఎలా గడిచాయో తెలియకుండా వారం రోజులు గడిచిపోయాయి.

ఆ వారం రోజులూ తన జీవితంలో కల్లా అమూల్యమయినవని ఆనాడు తెలియదు

ఈనాడు తెలిసినా ప్రయోజనంలేదు. తనను రైలెక్కిస్తూ ప్రాధేయత ధ్వనించే స్వరంతో అన్నాడు —




"మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావ్ ?"

"మళ్ళీనా ? ఎందుకూ ?"

జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. నర్వస్‌నెస్‌ని జయించటానికి ప్రయత్నిస్తూ ఎలాగో అనేశాడు.

"నువ్వెళ్ళిపోతున్నావంటే చాలా బాధగా ఉంది. ఈ వారమూ అద్భుతంగా గడిచిపోయింది నాకు. నిన్ను కలుసుకునే వరకూ ఎప్పుడు కలుసుకుంటానా అని తహతహలాడాను. ఈ ఎడబాటు ఎలా సహించగలనో అర్థంకావటంలేదు. నువ్వు శాశ్వతంగా నా దగ్గిర ఉండిపోలేవా ?"

ఏదో అసంభవ విషయం వింటున్నట్లు చూసింది అతని వంక.

"నేను యమ్. బి. బి. యస్. చదువుతున్నానని నీకు చెప్పలేదా ?"

కావాలని కంఠంలో ధ్వనింపచేసిన హేళన అతనిని గాయపరిచిందనటానికి వదిలిన అతని ముఖమే సాక్ష్యం.

పాడు అహం అంతటితో ఆగలేదు.

"ఎల్డీసీ కన్నా, నీకు ఎక్కువ ఆశలు లేవా రామూ ?" అన్నది తను.

"ఆశల కేం ? అవకాశా లెక్కడుంటాయి చెప్పు ?" అన్నాడతను.

అవకాశాలు వెతుక్కోలేనివాడూ, పెద్ద ఆశయాలు లేనివాడూ ఎమ్బీబీయస్‌కెట్లా సాటికాగలడు ?

అతని ముఖం మసిపూసినంత నల్లగా అయిపోయింది.

ఆ నలుపు అదేక్షణంలో తన మనసులోనూ ప్రతిఫలించిందనీ, ఒకనాటికి వామనమూర్తిలా పెరిగి తన బ్రతుకు

మొత్తాన్ని ఆహరించుకుంటుందనీ తెలిసి ఉంటే?...

తెలియదు కనుకనే అనగలిగింది.

"ఇంక మీదట మనం కలుసుకోం!"

రైలు భయంకరంగాకూసి అతని నుండి తనను విడదీస్తూ ముందుకు కదిలింది.

హృదయంలో అగ్నిపర్వతాలే రగులుతున్నాయో, మనసులో సాగర ఘోషే చెలరేగుతోందో, అతని చెయ్యిమాత్రం యాంత్రికంగా ఊగింది వీడ్కోలు చెపుతూ.

"జరిగింది మరిచిపో! హేమా! అర్హత తెలుసుకోకుండా ఆశలు పెంచుకున్నాను — ఎవరి కెంత ప్రాప్తమో అంత!" రైలుచక్రాల ధ్వనిలో కలిసిపోయి వినిపించాయి అతని మాటలు. అదే చివరిసారిగా అతనినోట తను విన్న మాటలు!

తరువాత ఎన్నెన్ని సంబంధాలు వచ్చాయో తనకి!

ఏ ఒక్కటీ నచ్చలేదు తనకి!

వచ్చిన ప్రతిపెళ్ళికొడుకునీ తనకు తెలియకుండానే తనమనసులోని అతనితో పోల్చుకుంటోందనీ ... అందుకే తన కెవరూ నచ్చటం లేదనీ ... నచ్చరనీ అప్పట్లో తనకు తెలిసిరాలేదు.

తెలియదు. తెలియదు...అదేఅజ్ఞానం ఆ అజ్ఞానంతోనే తెల్లవారిపోయింది బ్రతుకంతా.

"ఏవిఁ టాలోచిస్తున్నావ్! కారు ఆపినా దిగటంలేదు ఇదే మా ఇల్లు—"

గతకాలపు స్మృతులలోంచి వర్తమానంలోకి ఉలికిపడి కారులోంచి క్రిందకు దిగిఁది హేమ.

రెండంతస్థుల మేడా, ఇంటిముందరి లాన్స్, ఇంట్లోని ఫర్నిచరూ అతని ఐశ్వర్యాన్ని ఎలుగెత్తి చాటుతున్నాయి.

అతను పెళ్ళిచేసుకున్నాడా?

అతని శ్రీమతి ఎలా ఉంటుంది?

ఇద్దరూ అన్యోన్యంగా ఉంటారా?

కుతూహలంతో కొట్టుకుపోతోంది హేమ మనసు. అతను ఫలహారం, కాఫీ — అన్నీ వంటమనిషితో తెప్పించాడు. ఏవేవో కబుర్లు చెపుతున్నాడు. ఎంతకూ తనశ్రీమతిని పరిచయం చెయ్యడేం? కథల్లోలా ఇతనూ తనను కలవరిస్తూ అలా ఉండిపోయాడా?


ఈనాటికి తామిద్దరూ కలుసుకోగలిగారా?

ఒక్కసారిగా హేమహృదయం ఎగసిపడింది. అలసిన కళ్ళలో కాంతులు అలుముకున్నాయి.

"నువ్వింకా పెళ్ళిచేసుకోలేదా?" అన్నది తను కాఫీ—తాగినా పొడిగా ఉన్నట్టున్న గొంతుసవరించుకొని.

ఒక్కక్షణం విస్తుపోయినట్లుగా చూశాడు రాము.

"చేసుకున్నాను. అప్పుడు...మనం విడిపోయిన కొత్తల్లోనే చేసుకున్నాను.




నువ్వొచ్చి వెళ్ళిపోయాక తోడులేకుండా బ్రతకలే ననిపించింది. మా ఆవిడ నీలా చదువుకోలేదు. నేను అప్పట్లో మామూలు యల్. డి. సి. ని. అందుకని ఏరికోరి ఏం చదువుకోని అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. ఏదో, గంతకుతగ్గబొంత కదా!"

అతని స్వరంలో ఎత్తిపొడుపు ఏ కోశానాలేదు.

అతినిర్మలంగా చెపుతున్నాడు.

ఆ నైర్మల్యమే హేమ గుండెల్లో పొడిచింది.

ఏనాటివో తనఈసడింపు, తనచిన్న చూపు, ఇన్ని సంవత్సరాల ఒరపిడిలో పదునుదేరి తనమనసును ముక్కలుగా తరుగుతోంది.

ఎగసిన చివరి ఆశ సమసిపోగా స్థిరస్వరాన్ని తెచ్చిపెట్టుకొంటూ "మరి, ఆవిడని నాకు పరిచయం చెయ్యవేం?" అంది.

అతని ముఖం వడిలిపోయింది.

"ఆవిడకి ఇటీవల కొంచెం అనారోగ్యంగా ఉంది. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది, మంచంమీంచి లేవలేకపోతోంది."

"అయితే నన్ను చూడనియ్యి. నేను డాక్టర్నని మరిచిపోయావా?"

"చాలామందికి చూపించాను. ప్రయోజనం లేకుండా ఉంది. నీకే తెలుస్తుంది_ పరిచయం చేస్తాను. రా!"

రాము పరిచయం చెయ్యగానే ఎంతో కుతూహలంగా చూసింది హేమ.

నలుపువైపుకే మొగ్గే చామనచాయ. ముఖంలో పెద్ద ఆకర్షణలేదు. దానికితోడు

అనారోగ్యంవల్ల బాగా బలహీనంగా ఉంది.

మన మనసు లోపలి ఆలోచనలు ఎదుటివారికి తెలియకపోవటం ఎంత అదృష్టం!

ఆవిడని ఆస్పత్రిలో చూడగానే తన అంతరాంతరాల్లో తొంగిచూసిన పైశాచిక సంతృప్తి పైకి తెలిసిపోతే తానిక మనిషిగా ఎవరిముందైనా నిలువగలదా?

క్షణంలో సగంసేపు కదిలిన ఆ భావం మరుక్షణంలోనే కరిగిపోయింది.

ఇలా కరిగించుకో గలిగే శక్తి ఉండబట్టే మనుష్యలింకా మనుష్యలుగా మనగలుగుతున్నారు.

ఆవిడను పరీక్షచేసిన హేమ ఆశ్చర్యంగా రాము వంక చూసింది.

''ఇదంత భయంకాని జబ్బుకాదే! ఆపరేషన్ చేస్తే వెంటనే ఈ నొప్పి తగ్గిపోతుంది.''

''నాకు తెలుసు...కాని...''

రాము మాటలు పూర్తి కాకుండానే ఆవిడ బలహీన స్వరంతో అరిచింది.

''నాకు ఆపరేషన్ అక్కర్లేదు. నాకీ నొప్పి తగ్గిపోతుందిలెండి. అదే తగ్గుతుంది.''

ఆయాసపడిపోతోంది ఆవిడ.

రాము చటుక్కున ఆవిడ దగ్గరగా వచ్చి కూర్చుని లాలనగా శిరస్సు నిమురుతూ, ''సరే! సరే! ఆపరేషనొద్దులే. బెంగపడకు,'' అన్నాడు.

ఆవిడనెలాగైనా ఓదార్చాలని ఆదుర్దా స్పష్టంగా వ్యక్తమవుతున్న ధోరణిలో ఏదేదో మాట్లాడేస్తున్నాడు.

అంత నీరసంలోనూ ఆవిడ నవ్వింది.

''ఒకరిద్దరైనా పుట్టందే ఆపరేషనేమిటి నా బొంద!'' అన్నది.

బుజగింపుగా చెక్కిళ్ళు నిమురుతూ జాలిగా కళ్ళలోకిచూస్తూ ఆవిడన్న ప్రతిదానికీ ఔనంటున్నాడతను.

''నేను వెళ్తాను.'' లేచింది హేమ.

''నేను డ్రాప్ చెయ్యనా?''

''నీ దయ!''

''మీవారు ఇంకా రాలేదా?'' అన్నాడు యధాలాపంగా.

''మావారా! అటువంటివారెవరూ లేరు.''

రాము ముఖం పాలిపోయింది. ఆందోళనగా ''అంటే...''అని ఆగిపోయాడు.

విరగబడి నవ్వింది హేమ.

''నా ముఖంమీది బొట్టు చూస్తోంటే నేను వితంతువునుమటుకు కానని తెలియటంలా? ఇంకా పెళ్ళి చేసుకోలే!''

''తగినవాడు ఇంకా దొరకలేదా?''

హేమ మాట్లాడలేదు...

''అందమయినదానివి, చదువుకొన్నదానివి. నీకు తగినవాడు దొరకాలంటే మాటలా? తొందరపడి ఎవరినో కట్టుకోవటం కంటే తగినవాడికోసం నిరీక్షించటమే మంచిది.''



కొన్ని క్షణాలు రెప్పవాల్చకుండా అతని ముఖంలోకి చూసింది హేమ!

ఎంత ఆర్ద్ర హృదయం!

ఒకనాటి తన ఊహాన్ని దెప్పిపొడవటానికి అన్ని హంగులూ ఈనాడు ఇతనికున్నాయి. దెప్పకపోగా సముదాయిస్తున్నాడు!

"నేను వెళ్ళనా?"

"వెళ్ళు - ఎంతసేపని ఉంటావు?"

"అదేం? నీకేదైనా అవసరం ఉందా?"

"ఉంటే, ఉంటావా?"

"ఏం కావాలో చెప్పు. వీలైతే నీ పని అయ్యాకే వెళతాను."

అతి అమాయకంగా స్వచ్ఛమైన

అతను వెళ్ళిపోయిన చాలా సేపటి వరకూ తను కూర్చున్న చోటినుంచి లేవలేక పోయింది హేమ.

జబ్బుతో మూలుగుతూ అతిసాధారణమైన అందచందాలున్న తన భార్యను, ప్రక్కన కూర్చొని బుజ్జగిస్తోన్న రాము ముఖం ఎంత ప్రయత్నించినా ఆమె మనఃపథంనుండి తొలగిపోలేదు.

"వంట్లో ఎలా ఉందీ?" అని తన భార్యను అడగటానికొచ్చిన రాము, ప్రక్కనే కూచున్న హేమనుచూసి ఆశ్చర్యపోయాడు.

"నువ్వు వచ్చావా?"

"రోగిని చూశాక డాక్టర్ రాకుండా

వేళాకోళంగా నవ్వింది హేమ.

"ఆవిడ చాలా మంచివారండీ! ఆపరేషన్ అక్కర్లేకుండానే నాకు నొప్పి తగ్గిపోతుందిట!"

వికసించిన ముఖంతో అంది ఆవిడ. రాము ఆశగా హేమ ముఖంలోకి చూశాడు. హేమ ముఖం పక్కకి తిప్పుకుంది—ఒక్క నిట్టూర్పు విడిచాడు రాము.

ఆరోజు హేమను ఇంటిదగ్గిర డ్రాప్ చేస్తూ దారిలో అన్నాడు రాము

"నువ్వుచాలా మంచిదానివి హేమా! నువ్వింత చదువుకున్న దానివయినా, ఏం చదువుకోని మా ఆవిడతో ఎంతో స్నేహంగా మాట్లాడుతున్నావు"

గుండెలు చీల్చుకొంటూ ఒక్క నిట్టూర్పు వెలువడింది హేమకు.

"ఈ అంతస్థుల భేదాలు ఎంత అర్ధరహితమైనవో ఇప్పుడు తెలుస్తోంది రామూ! ఒకనాడు ఈ అంతస్థులకే ప్రాధాన్యంఇచ్చి నిన్ను దూరం చేసుకున్నాను. ఎంతమూర్ఖంగా ప్రవర్తించానో ఇప్పు డర్ధమవుతోంది."

"అవును. ఇప్పుడు నాకూ అంతస్థు ఉందిగా!" అతి మామూలుగానే అన్నాడు రాము. అయినా, 'కొరడాతో చరిచినట్లు అదిరిపడింది హేమ. తానన్న మాట హృదయపూర్వకంగా అన్నదే! అయినా ఆమాటకి విలువ ఆనాడు. ఈనాడు కాదు.

ఈనాడు ఆమాట అనటం తనను తాను అవమానించుకోవటం!

హేమను ఇంటిదగ్గిర విడిచి వెంటనే వెళ్ళటాని కుద్యుక్తుడయ్యాడు రాము.

"కాస్సేపు కూర్చోరాదూ! ఒక్కదానికీ బోర్ కొడుతోంది."

"పోనీ, మంచి పనిమనిషిని—ఎప్పుడూ నీతో ఉండేదాన్ని పెట్టుకో!"

రాము ముఖంలోకి చూసి నవ్వింది హేమ.

"పనిమనిషి నావంటరితనాన్ని దూరం చెయ్యగలదా?"

"చెయ్యలేదు!" అన్నాడతను సీరియస్‌గా!

కొద్దిసేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఉన్నట్టుండి రాము హటాత్తుగా లేచాడు.

"మళ్ళీ కలుస్తాను హేమా!" అంటూ హేమ సమాధానంకోసంచూడకుండానే వెళ్ళిపోయాడు.

చిత్తరువులా నిలిచిపోయింది హేమ.

మూడురోజుల తరువాత బాగా వడిలిపోయిన ముఖంతో వచ్చాడు రాము హేమ దగ్గిరకి...

ఆ ముఖంచూసి గాభరాపడుతూ "ఏం జరిగింది రామూ!"అంది అదుర్దాగా.

"మా ఆవిడకి మళ్ళీ నొప్పివచ్చింది విపరీతంగా!"

హేమ తేలిగ్గా ఊపిరి తీసుకుంది.

"అంతేకద! ఎప్పుడూఉండేదేగా!"

"అవును కానీ, ఈ క్షోభ ఇంకనేను సహించలేను. నువ్వీ విషయంలో నాతో కొంత సహకరించాలి. తప్పదు. తప్పే

అనుకో! అయినా అంతకంటె గత్యం తరం లేదు. నాలో సహనం చచ్చి పోతోంది.''

హేమ హృదయం ఊగిపోసాగింది. ఏం అడగబోతున్నాడితను ?

"ఒక్క వాగ్దానం మాత్రం చెయ్యాలి. ఈ విషయం మా ఆవిడకు తెలియనియ్య కూడదు."

చటుక్కున హేమ రెండు చేతులూ పట్టుకున్నాడు రాము.

హేమ శరీరంవిలువెల్లాపులకించింది. హృదయస్పందన హెచ్చింది.

"నాకు తెలుసు. ఒక విధంగా ఇది మోసమే - అన్యాయమే. అయినా తప్పదు."

తనను పెళ్ళిచేసుకోమని అడగబో తున్నాడా ? ఇందులో అన్యాయమే ముందీ ? ఆవిడ అలా రోగంతో తీసు కొంటూంటే ఇతను తన సుఖాల నన్నిం టినీ వదులుకొని సన్యాసిలా బ్రతకాలా?

ఇన్నాళ్ళ తన ప్రతీక్ష సఫలం కాబో తోందా ? కేవలం ఒక పగటికలగా మారిపోయిన అలనాటి ప్రేమానుభూతి నిజమై తన జీవితంలో తిరిగి వెన్నెలలు విరియించబోతుందా ?

"వింటున్నావా, హేమా ? నేను కోరినట్లు చెయ్యగలవా ?''

"వింటున్నాను చెప్పు. నువ్వు కోరితే నేను కాదనగలిగినదేదీ లేదు."

"నాకు తెలుసు. ఆ నమ్మకం ఉండ బట్టే అడుగుతున్నాను. నాతోపాటు నిన్నూ ఈ అన్యాయంలోకి లాగు తున్నాను.''

రాము చేతుల్లో హేమ చేతులు బిగుసుకున్నాయి.

హేమ సర్వచైతన్యమూ వ్యగ్రతతో ప్రతీక్షిస్తోంది అతను చెప్పబోయేది వినటం కోసం.

"ఆవిడను మభ్యపెట్టి ఆపరేషన్ చేసెయ్యాలి. ఆ బాధ నేను చూడలే కుండా ఉన్నాను. నాకు పిల్లలు లేకపో యినాపరవాలేదు. తను సుఖంగా ఉంటే చాలు. నాకు పిల్లలంటే ఇష్టమని అంత క్షోభనూ సహిస్తోంది. ఇష్టమయితే మాత్రం ఏం చేస్తాం! కావాలనుకున్న వన్నీ జీవితంలో రావు. ఆపరేషన్ అయినా పిల్లలు పుడతారని ఆవిడకు నచ్చజెప్పి ఆపరేషన్ చేసెయ్యి. ఇక నాకు పిల్లలు కలగరు. కానియ్యి. ఎవరి కెంత ప్రాప్తమో అంత !"

హేమ చేతులు రాము చేతుల్లోంచి జారిపోయాయి.

ఒక్కక్షణం సమస్తమూ శూన్య మైనట్టు అనిపించింది.

"ఏం ? చెయ్యవూ ?"

అప్రయత్నంగా హేమ రెండుచేతులూ జోడించింది.

ఆ నమస్కారం రాముకే కాదు, అతనిలోని మమతకీ మానవతకీ కూడా నని ఆ క్షణంలో ఆమెకు తట్టలేదు.